జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

ఆదివారం | 23-11-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 519 పేజీలు: 4 వెల : రూ.7




# రక్షక భటులకు.. రక్షణ ఏదీ?

* 24 గంటలు ఉద్యోగం
* సెలవులు అంతంత మాత్రమే
* కష్టంగా మారిన పోలీసు విధులు
* తీవ్ర ఒత్తిడిలో పలువురు పోలీసులు
* వ్యాధుల బారిన రక్షణ భటులు
* ఆవేదన వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు

శ్రీకాకుళం, నవంబరు 22 (వార్త): ఎండ, వాన, చలి అని లేకుండా ప్రజలకు రక్షణ కల్పిస్తున్న రక్షక భటులకు రక్షణ లేకుండా పోయింది. 24 గంటలు డ్యూటీలు చేయాల్సివస్తోంది. ఎప్పుడు ఇంటికి వెళతారో తెలియని పరిస్థితి. వారికి వారానికో సెలవు ఉన్నప్పటికీ వాడుకోలేని దుస్థితి. 24 గంటలు ఒత్తిడితో కూడుకున్న ఉద్యోగం. తమ శాఖ అధికారులకు చెప్పుకోలేక, కుటుంబానికి సమయం కేటాయించలేక సతమతమవుతున్నారు. తమ పిల్లలు ఎలా ఉన్నారు, ఏం చదువుతున్నారో కూడా తెలుసుకోలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. సెలవు కావాలంటే పర్మిషన్ పెట్టుకోవాల్సిందే. అత్యవసర పరిస్థితుల్లోనూ సెలవులు దొరక్కపోవడంతో మానసిక ఒత్తిడికి గురవుతూ వ్యాధుల బారిన పడుతున్నారు. దీనికితోడు సరైన సమయానికి డీఏలు, సరెండర్ లీవులకు చెందిన నగదు రాకపోవడంతో ఆర్థికంగానూ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రతి శాఖలోనూ సంఘాలు ఉంటాయి.. ఒక్క పోలీసు శాఖలో తప్ప. దీంతో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ స్థితిలో పోలీసులు ఉన్నారు. ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే గత ఐదేళ్లలో సుమారుగా 15 మంది పోలీసులు అనేక ఒత్తిళ్లతో మృతి చెందారు. మరో ఎనిమిది మంది మంచం పట్టారు. కిడ్నీ, ఛాతి, మెదడు, తదితర మానసిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు, నడుంనొప్పి, కాళ్లనొప్పితో బాధపడుతున్నారు. పోలీసులు అధికారులు మాత్రం ప్రతిరోజూ యోగా చేయాలని, మానసిక ఒత్తిడిని అధిగమించాలని చెబుతున్నా సరైన సమయం లేక, కేటాయించలేక కొందరు పోలీసులు రోగాల బారిన పడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పోలీసులకు సరైన సమయంలో వైద్యసదుపాయం అందించేలా చూడాల్సివుంది.




## రిమ్స్‌లో రౌడీయిజం

* ఆసుపత్రిలో రోగి బంధువుపై స్వీపర్ దాడి
* మద్యం మత్తులో కొందరు సిబ్బంది దుర్భాషలు
* ఆవేదన వ్యక్తం చేస్తున్న రోగులు, వారి బంధువులు

శ్రీకాకుళం, నవంబర్ 22 (వార్త): పేదల ఆసుపత్రి అయిన శ్రీకాకుళం రిమ్స్‌లో కొందరు సిబ్బంది వల్ల ఆసుపత్రికే చెడ్డపేరు వస్తోంది. కొందరు సిబ్బంది రాత్రివేళ మద్యం తాగి వచ్చి విధులు నిర్వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో రోగులతో పాటు వారి బంధువులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యులు సైతం మద్యం తాగి వచ్చిన సిబ్బందిని మందలిస్తున్నా వారి తీరు మారడం లేదు. సరికదా ఎదురుదాడి చేస్తున్నారు. తన తండ్రికి డయాలసిస్ చేయించేందుకు ఆసుపత్రికి వచ్చిన నరసన్నపేట మండలం జమ్ము గ్రామానికి చెందిన గౌరీశంకర్‌పై, కోటబొమ్మాళి మండలం కొబ్బరిచెట్లపాడుకు చెందిన కె.రామారావును వైద్యం కోసం రిమ్స్‌కు వారి బంధువులు తీసుకురాగా, వారిపై ఓ స్వీపర్ దుర్భాషలాడడం కనిపించింది. దీనిపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక వారు మౌనం వహించారు. రోగులను వార్డుల్లోకి తీసుకు వెళ్లేందుకు సైతం కొందరు సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇస్తే లోపలికి సకలమర్యాదలతో తీసుకువెళుతున్నారు. ఎవరైనా ఇవ్వకుంటే అలా వెళ్లండి.. ఇలా వెళ్లండని ఉచిత సలహాలు ఇస్తూ పట్టించుకోవడం లేదు. దీంతో రోగుల బంధువులు రాత్రివేళల్లో నానావస్థలు పడుతున్నారు. ఎవరైనా ఇదేంటని నిలదీస్తే మద్యం మత్తులో దాడికి పాల్పడుతున్నారు. దీన్ని అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది నిలదీస్తున్నప్పటికీ వారికి కూడా బెదిరింపులు తప్పడం లేదు. ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా జిల్లా కలెక్టర్ స్పందించాలని రోగుల బంధువులు కోరుతున్నారు.




# గజదొంగ కృష్ణ దొరికాడు!

* అరెస్టు చేసిన సిక్కోలు పోలీసులు
* 18 కేసుల్లో 33.25 లక్షల విలువైన బంగారు,వెండి ఆభరణాలు స్వాధీనం
* పక్కా ప్రణాళిక, ప్రత్యేక క్రైమ్ టీమ్‌లతో నేరస్థుడు అరెస్టు
* కేసు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం క్రైం, నవంబరు 22 (వార్త): గత కొంతకాలంగా జిల్లా ప్రజలనే కాకుండా ఏపీ పోలీసులను కంటిమీద కునుక లేకుండా చేసిన గజదొంగ దున్న కృష్ణను శ్రీకాకుళం పోలీసులు స్కెచ్ వేసి మరీ పట్టుకున్నారు. పక్కా ప్రణాళక, ప్రత్యేక పోలీసు బృందాలతో గజదొంగ మీద నిఘా పెట్టి ఎట్టకేలకు అరెస్టు చేసి.. శభాష్ సిక్కోలు పోలీస్ అనిపించుకున్నారు. ఈ మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌పై 250 కేసులు ఉండగా 195 కేసుల్లో శిక్ష కూడా పడింది. జైలుకు వెళ్లడం బెయిల్‌పై రావడం, ఆపై మరిన్ని దొంగతనాలు చేస్తూ పోలీసులకు సవాల్ విసురుతుండే దున్న కృష్ణపై లక్ష రివార్డు కూడా ఉంది. చివరికి పోలీసులు చాకచక్యంతో గజదొంగను అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియా సమావేశంలో శనివారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వెల్లడించారు. జిల్లా ప్రత్యేక క్రైం బృందాలు ఈ గజదొంగను పట్టుకోవడంతో పాటు 33.25 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, లక్షా 50వేలు నగదు స్వాధీనం చేసుకున్నారన్నారు. అతనిపై శ్రీకాకుళం రూరల్ పరిధిలో 14 కేసులు, శ్రీకాకుళం 2 టౌన్ పరిధిలో 3 కేసులు, శ్రీకాకుళం 1 టౌన్ పరిధిలో ఒక కేసు నమోదైందన్నారు. బంగారం 237 గ్రాములు, వెండి 1391 గ్రాములు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దున్న కృష్ణతో పాటు సయ్యద్ రఫీని అరెస్టు చేశామన్నారు. దున్న కృష్ణపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో కలిపి 218 కేసులు నమోదయ్యాయన్నారు. శ్రీకాకుళం జిల్లాలో 18 దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. గత 33 ఏళ్లుగా నిరంతరంగా దొంగతనాలు, ఇప్పటి వరకు 60 కేసుల్లో శిక్ష, జీవితంలో సగం కాలం జైలు జీవితం గడిపారని తెలిపారు. ఏ విధమైన వ్యక్తిగత గుర్తింపు కార్డు, మొబైల్ ఫోన్ వాడకపోవడం, కలకత్తా నుండి శ్రీకాకుళం వచ్చి, దొంగతనాలు చేసి తిరిగి వెళ్లిపోవడం అతని పద్ధతి అని తెలిపారు. అత్యంత చురుకైన తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడేవారన్నారు. ఈనెల 20న ఒప్పంగి గ్రామంలో ముద్దాయిలను అరెస్టు చేశామని ఎస్పీ తెలిపారు. విచారణలో శ్రీకాకుళం జిల్లాలో 18ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడినట్టు ఒప్పుకున్నారన్నారు. జైలు శిక్ష అనుభవిస్తున్న సమయంలో దున్న కృష్ణకు రఫీ పరిచయం అయ్యాడన్నారు. అతను దొంగిలించిన బంగారం, వెండిని రఫీ కొనుగోలు చేసి, తనకు తెలిసిన వ్యక్తులకు అమ్మేవాడన్నారు. దొంగసొత్తును వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలోని సోనాపూర్ ప్రాంతానికి చెందిన అంతన్షపుల్, తరణ్ మండల్‌అనే వ్యక్తులకు కూడా అందజేసినట్లు రఫీ ఒప్పుకున్నాడని, త్వరలో వారిని కూడా అరెస్టు చేస్తామని ఎస్పీ తెలిపారు. దున్న కృష్ణ, రఫీలను అరెస్టు చేయడంలో చురుగ్గా వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ అభినందించారు. రూరల్ సర్కిల్ సిఐ కె.పైడపునాయుడు, సీసీఎస్ సీఐ చంద్రమౌళి, సీసీఎస్ ఎస్సైలు రాజేష్, గణేష్, రూరల్ ఎస్సై కె.రాము, సిబ్బందిని ఎస్పీ అభినందనలు తెలిపారు.







## పొగ మంచుతో.. ప్రాణాలు హరీ!

* ఇటీవల దట్టంగా కురుస్తున్న పొగమంచు
* రహదారులపై వాహనాలు కనిపించక ప్రమాదాలు
* పొగమంచుతో దారి కనిపించక వాహనచోదకుడిని ఢీకొట్టిన లారీ

4లో

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# జాతీయ స్థాయి చెస్ పోటీలకు డొంకూరు విద్యార్థులు



**ఇచ్ఛాపురం, నవంబరు 22(వార్త):** జాతీయస్థాయి చెస్ పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డొంకూరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల విశాఖపట్నం వేదికగా జరిగిన బాల, బాలికల ఆలిండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 23 నుంచి 24 వరకు విజయవాడ వేదికగా స్టెల్లా ఇండోర్ స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో అండర్-14 బాలురు విభాగంలో చరణ్, అండర్-15 విభాగంలో గోకుల్, పృథ్వీ పాల్గొంటారు.


వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.హేమకుమారి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.జానకిరావు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు అభినందించారు.

## తాగునీటి సరఫరాపై ప్రభుత్వాల ప్రత్యేక శ్రద్ధ



**జి.సిగడాం, నవంబరు 22(వార్త):** తాగునీటి సరఫరాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయని టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు బూరాడ వెంకటరమణ అన్నారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వంరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆదేశాల మేరకు శనివారం జి.సిగడాంలో రూ.1.98 కోట్లతో చేపట్టే తాగునీటి వాటర్ ట్యాంక్ పనులను వారు ప్రారంభించారు. ఈ పనులు పూర్తయితే పూర్తి స్థాయిలో గ్రామంలో మంచినీటి సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రామకృష్ణారావు, కూటమి మండలాధ్యక్షులు పైల విష్ణుమూర్తి, మీసాల రవికుమార్, సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, సర్పంచ్ ప్రతినిధి ముద్దాడ గౌరీశంకర్, సి.గోవిందరావు, మజ్జి కన్నంనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కుసుమ, కొన వెంకట్రావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నరసన్నపేట సబ్ జైలును తనిఖీ చేసిన జడ్జి




**నరసన్నపేట, నవంబరు 22(వార్త):** నరసన్నపేట సబ్ జైలును సివిల్ జడ్జి ఎస్.వాణి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ జైలుకు చేరుకున్న ఆమె ముద్దాయిలకు అందుతున్న భోజన సదుపాయం, వైద్య సహాయం తదితర వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులను పెట్టుకోలేని ముద్దాయిలు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు. ఆరోగ్యంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జైలు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

## తైక్వాండో క్రీడాకారులను అభినందించిన ఎస్ఐ



**పోలాకి, నవంబరు 22(వార్త):** తైక్వాండో క్రీడాకారులను ఎజి.రంజిత్ శనివారం అభినందించారు. పోలాకిలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తైక్వాండో శిక్షకుడు హరీష్ ఆధ్వర్యంలో సుమారు 20 మంది చిన్నారులు శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణను పరిశీలించిన ఎస్ఐ వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆత్మరక్షణ కోసం ఇటువంటి క్రీడలు నేర్చుకోవడం ఆనంద దాయకమన్నారు.

## జాతీయ రహదారిపై వ్యాన్ బోల్తా..దగ్ధం



**నరసన్నపేట, నవంబరు 22(వార్త):** నరసన్నపేట-జడూరు మధ్య జాతీయ రహదారిపై ఐచర్ వ్యాన్ బోల్తా పడి అగ్నికి ఆహుతైన ఘటన శనివారం ఉదయం చోటుచేసుకుంది. టెక్కలి నుంచి నరసన్నపేట వైపు వస్తున్న వ్యాన్ చిత్తు కాగితాలతో వెళ్తుండగా వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆ వ్యాన్ పాక్షికంగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

## తిమడాంలో ఉపాధి హామీపై అవగాహన

**జలుమూరు, నవంబరు 22(వార్త):** తిమడాంలో నిర్వహించిన గ్రామసభలో ఉపాధి హామీ అధికారులు పాల్గొని ఉపాధి హామీ పథకానికి సంబంధించిన ముఖ్య అంశాలను ప్రజలకు వివరించారు. ప్రస్తుత ఉపాధి హామీ పనుల పురోగతి, పని అందుబాటు, కార్మికులకు లభించే సౌకర్యాలు వంటి విషయాలను స్పష్టంగా చర్చించారు. ఉపాధి హామీ పథకం కింద కొత్త జాబ్ కార్డులు కావలసిన వారు సంబంధిత దరఖాస్తులను సమర్పించి, తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలియజేశారు. పథకాన్ని మరింత పారదర్శకంగా, ప్రతి అర్హుడు లబ్ధి పొందేలా చేయడమే తమ లక్ష్యమని వారు పేర్కొన్నారు. గ్రామస్థులు పథకం వివరాలను ఆసక్తిగా విని, కొత్త జాబ్ కార్డ్ కోసం అనేక మంది ముందుకు రావడంతో సమావేశం చురుకుగా కొనసాగింది. ఉపాధి అవకాశాలను పెంచడంలో ఈ కార్యక్రమం మైలురాయిగా నిలుస్తుందని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు.ఫీల్డ్ అసిస్టెంట్ కోయరు జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.



# మావోయిస్టులతో కేంద్రం తక్షణమే శాంతి చర్చలను జరపాలి

-బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపాలి

-సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డిమాండ్

-మర్రిపాడు అమరవీరుల స్థూపం వద్ద అమర వీరులకు ఘన నివాళి




**పలాస, నవంబరు 22(వార్త):** మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం తక్షణమే శాంతి చర్చలను జరపాలని, బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శనివారం వజ్రపుకొత్తూరు మండలం మర్రిపాడు గ్రామంలో శ్రీకాకుళం అమరవీరుల స్మారక స్తూపం వద్ద అమరవీరుల స్మారక సభను న్యూ డెమోక్రసీ పార్టీ నిర్వహించింది. ఈ సభకు న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అధ్యక్షత వహించారు. తొలుత స్థూపంపైన అరుణ పతాకాన్ని ప్రకాష్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్రి దానేషు, అమరవీరుల బంధుమిత్రుల కమిటీ నాయకులు జోగి కోదండరావు, ప్రజా కళా మండలి నాయకులు కొర్రాయి నీలకంఠం, లిబరేషన్ నాయకులు వంకల అప్పయ్య, ఏఐకేఎంఎస్ నాయకులు గొరకల బాలకృష్ణ, ఐఎఫ్‌టీయూ నాయకులు జుత్తు వీరాస్వామి, యస్.కృష్ణవేణి, పీడబ్ల్యు నాయకులు పి.కుసుమ, బి.ఈశ్వరమ్మ, పీవైయల్ నాయకులు సార జగన్ తదితరులు మాట్లాడుతూ అడవి సంపదను బడా కార్పొరేట్లకు అప్పగించడానికి పాలకులు ఆపరేషన్ కగార్‌ని తీసుకొచ్చారన్నారు. 2026 మార్చి 31 నాటికి మావోయిస్టు ముక్త భారత్ సాధిస్తామని ప్రకటిస్తున్నారని, ఈ 11 నెలల్లో 800 మందిని ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపారని ఆరోపించారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ పార్టీ కేంద్ర కమిటీ నవంబర్ 21, 22 తేదీల్లో నిరసన కార్యక్రమాలను ప్రకటించిందని, మావోయిస్టులపై దమనకాండను ఆపాలని, శాంతి చర్చలను జరపాలనే డిమాండ్లతో దేశవ్యాప్తంగా ఆందోళనకు న్యూడెమోక్రసీ పిలుపునిచ్చిందని వారు గుర్తు చేశారు. సభకు ముందు అమరులను స్మరిస్తూ అంతా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సభలో పలు ప్రజా సంఘాల నాయకులు రాపాక మాధవరావు, కర్రి అప్పారావు, గర్తం కామేశ్వరరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షులు సొర రామారావు తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు అండగా టీడీపీ ప్రభుత్వం

-ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి -ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



**పోలాకి, నవంబరు 22(వార్త):** కత్తిరివానిపేటలోని తన క్యాంప్ కార్యాల యంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శని వారం లబ్ధిదారులకు అందజేశారు. గుల్లవానిపేటకు చెందిన సింగిపల్లి ప్రాచీన కు రూ.87,983 చెక్కును, మబగాం పంచాయతీ, పూడివానిపేట గ్రామానికి చెందిన పూడి నీలకంఠంకి 52,522 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు గొప్ప మానవత్వం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎందరో పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు తెలుగు నాగేశ్వరరావు, కాయ రవి, పూడి బాబూరావు, దాసరి రఘు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సజావుగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు



**ఇచ్ఛాపురం, నవంబరు 22(వార్త):** మండలంలో అన్ని స్కూల్ కాంప్లెక్స్‌లలో ఈదుపురం, డొంకూరు లొద్దపుట్టి, రత్తకన్న పురుషోత్తపురం లలో ఎస్ జి టి లకు ఆయా కాంప్లెక్స్ ల లో మరియు స్కూల్ అసిస్టెంట్స్ లకు అన్ని పాఠశాల ల స్కూల్ అసిస్టెంట్స్ లకు అన్ని సబ్జెక్టు లు వారు కు ప్రభుత్వ ఉన్నత పాటశాల లో జరిగాయి. మండల విద్యాశాఖాధికారి -1 కె అప్పారావు కాంప్లెక్స్ లను వ విజిట్ చేసారు . మండల విద్యాశాఖాధికారి -2 ఎస్. విశ్వనాధం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ను విజిట్ చేశారు. ఈ సమావేశం మధ్యాహ్నం 1 గం . నుండి సాయంత్రం 5 గం. వరకు జరిగాయి. ఈ సమావేశం లో ఎస్ ఏ 1ప్రశ్న పత్రం పై విశ్లేషణ, మోడల్ లేసన్ , 10 వ తరగతి 100 రోజుల ప్లాన్ పై సుధీర్ఘమైన చర్చ జరిగింది. సి.డి గ్రేడ్ విద్యార్థులకు రెమిడేషన్ ప్లాన్ గూర్చి చర్చించడం జరిగింది. ఈ కాంప్లెక్స్ మీటింగ్ లు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ వారి ఆధ్వర్యం లో జరిగాయి.466 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి పాఠశాలకు 'గణేశ్వరరావు' బీరువా వితరణ



**మందస, నవంబరు 22(వార్త):** సుదీర్ఘకాలం పాటు జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, ఇంచార్జి ప్రధానోపాధ్యాయునిగా కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవలందించి, ఇటీవల బదిలీపై వెళ్లిన సవర గణేశ్వరరావు తన ఉదారతను చాటుకున్నారు. పాఠశాలకు బీరువాను కానుకగా అందించారు. ఆయన ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడుగా ఉన్నకాలంలో కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు అనేక విజయాలను పాఠశాలకు అందించారని, పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహించి పాఠశాలకి షైనింగ్ స్టార్ అవార్డు ని అందించడంలో ఆయన ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ప్రతీ విద్యార్థి పుట్టినరోజు ఒక మొక్కని పాఠశాలకు బహుకరించించే సాంప్రదాయాన్ని ఆయన ప్రారంభించారని అన్నారు. ఆయనకు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఆయన్ని అభినందించిన వారిలో ప్రధానోపాధ్యాయుడు కూన వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు జి భీమారావు, జి జానకమ్మ, ఎం లక్ష్మణరావు, ఎ అప్పారావు, బి పాపమ్మ, ఎం చిత్రసేను, జి సూర్యనారాయణ, జి చిన్నికృష్ణ, బి రమేష్ తదితరులు ఉన్నారు.

## కళాకారుడు తుంబయ్యకి ఘన సన్మానం



**ఇచ్ఛాపురం, నవంబరు 22(వార్త):** టి బరంపురంలో కళాకారులు స్వర్గీయ కప్ప నరసింహారెడ్డి 21వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన గురువుకు అత్యంత సన్నిహితుడు, కళాకారుడు, కవిటి మండలం జి.బెలగం గ్రామ వాస్తవ్యులు బంగారు తుంబయ్యని మహతి సాంస్కృతక కళాసేవా సంస్థ ఆధ్వర్యంలో ఎంపీపీ బోర పుష్ప సమక్షంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పురజనులు మహతి సంస్కృతిక కళాసేవా సంస్థ కమిటీ సభ్యులు ఇచ్ఛాపురం, కవిటీ, సోంపేట, ఒడిశా కళాకారులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో వ్యక్తి గలాట..
## 10 రోజుల జైలుశిక్ష



**శ్రీకాకుళం, నవంబరు 22(వార్త):** మద్యం తాగి యాతపేట వద్ద గలాట చేసిన బొంతలకోడూరుకు చెందిన దాసరి కళ్యాణ్‌పై ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.లక్ష్మణరావు కేసు నమోదు చేసి, శనివారం శ్రీకాకుళం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును విచారించిన మేజిస్ట్రేట్ .. నిందితుడికి 10 రోజుల జైలు శిక్ష విధించారు.

## భద్రాచలంకు హనుమాన్ భక్తుల పాదయాత్ర



**సంతబొమ్మాళి, నవంబరు 22(వార్త):** సంతబొమ్మాళి నుంచి ఐదుగురు హనుమాన్ భక్తులు కాలినడకన భద్రాచలంకు శనివారం బయలుదేరారు. హనుమాన్ దీక్ష తీసుకొని 25రోజులు పూర్తి చేసుకున్న సంతబొమ్మాళి గ్రామానికి చెందిన చాలపాకు నాగరాజు, కొన్న లింగరాజు, కొన్న మణి (బాల స్వామి), ఒడిస్సా కు చెందిన జగత్ మోహన్, అలాగే బృందావనం కు చెందిన అచ్చుతరావు స్వాములు ఉదయం స్థానిక పంచముఖంజనేయ ఆలయం సన్నిధి నుంచి గురు స్వామి రాజు జెండా ఊపి వీరి యాత్రను ప్రారంభించారు. ఈ స్వాములు సుమారు 600 కిలోమీటర్లు 18రోజులు పాదయాత్ర చేసి డిసెంబర్ 12న భద్రాచలం చేరుకొని స్వామి వారికి ఇరుముడులు సమర్పించుకోనున్నారని గురుస్వామి తెలిపారు.

## చల్లవానిపేట విద్యార్థినిలకు కరాటే శిక్షణ

**జలుమూరు, నవంబరు 22(వార్త):** చల్లవానిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలకు కరాటేలో శిక్షణ ఇస్తున్నామని హెచ్ఎం నిర్మలాదేవి శనివారం తెలిపారు. కరాటే శిక్షకుడు ఎస్.సింహాచలం ఆధ్వర్యంలో ఈ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఝాన్సీలక్ష్మీబాయి ఆత్మరక్షణ కార్యక్రమం పేరిట దీనిని చేపట్టామన్నారు. ఈ శిక్షణా తరగతులు ప్రతిరోజు ఒక గంట పాటు నిర్వహిస్తామని పేర్కొన్నారు. శిక్షణను సద్వని యోగం చేసుకోవాలని ఆమె కోరారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం




## మరువాడలో ఉచిత మెగా వైద్య శిబిరం

**సంతబొమ్మాళి, నవంబర్ 22 (వార్త) :** మండలంలో మరువాడ పంచాయతీ ప్రజా వేదిక ఆవరణంలో జెమ్స్ హాస్పిటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ రకాల వ్యాధులకు ఉచిత పరీక్షలు జరిపి, అవసరమైన మందులను ఉచితంగా అందించారు. అలాగే బీపీ, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలు వంటి సేవలను వైద్యులు అందించారు.గ్రామ ప్రజలు, పరిసర ప్రాంత నివాసులు పెద్ద సంఖ్యలో హాజరై సేవలను పొందారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి దాసురాజు, మత్స్యకార సొసైటీ ప్రెసిడెంట్ గంట లోకేశ్వరరావు, మాజీ సర్పంచ్ మెరుగు నూకయ్య, నిరాకరి,వీరభక్తులు, యువకులు పాల్గొన్నారు.

# పలాసను సుందరంగా తీర్చిదిద్దేందుకు సహకరించండి

### - మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు



**పలాస, నవంబరు 22(వార్త):** పలాస మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులు కోరారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో రోజువారీ శానిటేషన్ పరిశీలనలో భాగంగా శనివారం మున్సిపల్ కమిషనర్ ఇ. శ్రీనివాసులు కాశీబుగ్గ 14వ వార్డు సంత మైదానంలో గార్బేజ్ లిఫ్టింగ్ పనులను పరిశీలించారు. 4వ వార్డు పద్మనాభపురం కాలనీలోని పలు వీధులలో శానిటేషన్, వాటర్ సప్లై విధానాన్ని ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. శాంతినగర్ కాలనీలో ప్రజల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. శాంతినగర్ మధ్య వీధిలో సుమారు 300 మీటర్ల సిమెంట్ కాలువ నిర్మాణం, పవర్ బోరు మరమ్మతులు తదితర సమస్యలను ప్రజలు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ అక్కడే ఉన్న ఇంజనీరింగ్ సిబ్బందిని కాలువ నిర్మాణానికి అంచనాల తయారు చేయమని ఆదేశించారు. ఈ పనిని శాసన సభ్యులు, చైర్మన్ దృష్టిలో పెట్టి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. తాగునీటి సరఫరాకి సంబంధించి జగన్నాథ సాగరం వద్ద గల పంప్ హౌస్‌ను ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. తాగునీటి సరఫరా పంపింగ్ జరుగు తున్న విధానాన్ని అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాగు నీటి సరఫరాలో ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలగ కుండా చూడాల్సిందిగా ఆదేశించారు. కమిషనర్ వెంట మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




## రామకృష్ణాపురంలో సత్యసాయిబాబా ఆకృతి



**పలాస, నవంబరు 22(వార్త):** శ్రీసత్యసాయి విద్యావిహార్ రామక్రిష్ణపురము భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి శతవర్షజయంతి సందర్భంగా శ్రీ సత్యసాయి విద్యావిహార్ లో శనివారం విద్యార్థులతో సాయిబాబా ఆకృతిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి విద్యా విహార్ ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశం మాట్లాడుతూ సత్యసాయి బాబా చేసిన ప్రేమ, సేవా, శాంతి సందేశాలు విశ్వానికి చాటి చెప్పారని అన్నారు. ఈ శతజయంతి ద్వారా మరింత విస్తారంగా ప్రాచుర్యం పొందాయిని తెలిపారు. ఈ శతవర్షఉత్సవాలు సత్యసాయి బాబా సేవా సత్వాన్ని ప్రపంచానికి చూపిస్తూ, వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ భావనను, మానవ సేవే మాధవ సేవ అని ప్రాధాన్యం చెప్పే ధార్మిక, సామాజిక ఉత్సవాలు కూడా నిర్వహించబడ్డాయిని, రామక్రిష్ణపురము విద్యార్థులు స్వామివారికి ఈ వంద వ నెంబర్ ఆకారము లో కూర్చుని అందరినీ అలరించారు. పీఈటీలు కిరణ్, గురునాథ్ ల దర్శకత్వంలో ఆకృతిని ప్రదర్శించారు.

## రాష్ట్ర రెడ్డిక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్‌గా కొండ శంకర్ రెడ్డి



**ఇచ్ఛాపురం, నవంబరు 22(వార్త):**రాష్ట్ర రెడ్డిక వెల్ఫేర్ అండ్ డేవేలప్మెంట్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్‌గా కొండ శంకర్ రెడ్డి ని నియమిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో 11 కార్పొరేషన్ లకు చైర్మన్ లను నియమించగా ఇచ్ఛాపురం బెల్లుపడకి చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బి సి సాధికారత సమితి చైర్మన్ కొండ శంకర్ ను ఈ పదవి లో నియమించారు. గత రెండు ఎన్నికల్లో పార్టీ విజయం కోసం తీవ్రంగా కృషి చేసారు. గత ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే బెందాలం అశోక్ మూడోసారి హ్యాట్రిక్ ఎమ్మెల్యే గా 40 వేలు పై చిలుకు మెజార్టీ తో గెలుపొందుతారని అందరికంటే ముందుగా జ్యోస్యం చెప్పారు. తొలుత కాంగ్రెస్ పార్టీ లో పట్టణ అధ్యక్షుడు గా పని చేసి అనంతరం సమైక్యాంధ్ర ఉద్యమం లో పార్టీ ని వీడి సమైక్యాంధ్ర పార్టీ లో చేరారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరి పార్టీ లో బి సి రెడ్డిక సామాజిక అభ్యున్నతికి కృషి చేసారు.రెండు సార్లు ఎమ్మెల్యే గా పని చేసిన దివంగత ఉప్పాడ రంగబాబు తమ్ముడు గిరి కుమార్తె భారతి ని వివాహమాడారు.ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. గతంలో ప్రయివేటు స్కూల్ నడిపి విద్యాభివృద్ధికి కృషి చేసారు.ఆటో యూనియన్ నాయకుడు గా సేవలందిస్తున్నరు.తనకు పదవి లభించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు కు మంత్రులు లోకేష్ కు ,కొల్లు రవీంద్ర కు,సవిత కు, అచ్చెమ్ నాయుడుకు,కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కు ఎమ్మెల్యే బెందాలం అశోక్ కు ఇతర కూటమి నాయకుల కు కృతజ్ఞతలు తెలిపారు.

## క్లస్టర్ల విధానంలో ఉపాధ్యాయుల బోధన



**జలుమూరు, నవంబరు 22(వార్త):** విద్యాశాఖ ఆదేశాల మేరకు క్లస్టర్ల విధానంలో ప్రభుత్వ పాఠశాలలో బోధన ప్రక్రియను నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ఎంవీ ప్రసాద్ రావు తెలిపారు. శనివారం జలుమూరు మండలం చల్లవానిపేట జడ్పీ స్కూల్లో నిర్వహించిన క్లస్టర్ల సమావేశంలో వీరు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. స్కూల్ అసిస్టెంట్లను, ఎస్ జీటీలను క్లస్టర్ ఉపాధ్యాయులుగా నియమించి విద్యార్థులకు విద్యా బోధన అందిస్తున్నామన్నారు.

## పాడి పరిశ్రమతో రైతులకు ఎంతో మేలు



**మందస, నవంబరు 22(వార్త):** పాడి పరిశ్రమతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వెటర్నరీ సర్జన్ మందస డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. ఆదిత్య జూనియర్, డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరాలు ఉమాగిరి, పితాతొళికాలనీలలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరాల్లో భాగంగా ఆరవ రోజు వెటర్నరీ సర్జన్ మందస డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పాడి పరిశ్రమ వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, ప్రభుత్వం తోడ్పాటు వివిధ రకాల స్కీముల్ ద్వారా అందిస్తుందన్నారు. పశువుల్లో వచ్చేటటు వంటి దీర్ఘకాలిక రోగాలకు ఏ రకంగా మందులు వేసుకోవాలనే విషయంపై రైతులకు అవగాహన కల్పించారు. పితాతొళికాలనీ గ్రామంలో వలంటీర్లు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బహిరంగ మలవిసర్జన అనేది నేరమని, సుకన్య సమృద్ధి యోజన, పెరటి తోటలు పంపకంపై చైతన్యం చేశారు. అందులో ఉన్న మెలకువలు గురించి, తదితరాంశాలపై గ్రామస్తులకు చైతన్యం కలుగజేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్పీవోలు మన్మధరావు, రవిశంకర్, కృష్ణారావు అధ్యాపకులు కళాశాల ప్రిన్సిపాల్ దొంగ ప్రవీణ్, మార్పు హరికృష్ణ ప్రసాద్ వాలంటీర్లు పాల్గొన్నారు.




## విద్యాభివృద్ధికి కృషి



**పోలాకి, నవంబరు 22(వార్త):** విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం దీర్ఘాశి పంచాయతీ కింజరాపు వానిపేటలో రూ.29.30 లక్షలతో ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదులు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, టిడిపి మండల అధ్యక్షుడు ఎం. వెంకట అప్పలనాయుడు, కళింగ కార్పోరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, సొసైటీ చైర్మన్ బైరి భాస్కరరావు, సర్పంచ్ మెండ సుమంగళి, మాజీ సర్పంచ్ పల్లి సూరిబాబు, సూరపు నారాయణ దాసు, చిట్టి సింహాచలం, మెండ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బాలికల శారీరక..
## మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



**పలాస, నవంబరు 22(వార్త):** బాలికల సమగ్రాభివృద్ధి కోసం శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని పలాస ఐసిడి ఎస్ పివో కే పార్వతి అన్నారు. శనివారం పలాస లోని మున్సిపల్ పరిధిలో మిగిలిపాడు, పలాస-1, పలాస-2, పురుషోత్తపురం, రెడ్డికి వీధి అంగన్వాడి కేంద్రాలు కిశోర వికాసం పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పివో మాట్లాడుతూ బాలికల సమగ్రాభివృద్ధి కోసం కిశోర వికాసం పథకం ప్రభుత్వం తీసుకొచ్చిందని,"కిశోరి వికాసం" వంటి కార్యక్రమాలు బాలికల సమగ్రాభివృద్ధికి పునాది వేసే చర్యలు, శారీరక, మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించి సమస్యలు పరిష్కరించే కృషి నిర్వహిస్తాయని తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో బాలిక సాధికారత క్లబ్బులు ఏర్పాటు చేయడం ద్వారా వ్యక్తిగత పరిశుభ్రత, జీవన నైపుణ్యాలు, ఆరోగ్య రక్షణపై అవగాహన పెరుగుతుందని అన్నారు. ఇలా గ్రామస్థాయిలో బాలికల సంఘాల ఏర్పాటు మరింత బలమైన మద్దతు అందిస్తుందని చెప్పారు. ఈ విధంగా బాలికల శారీరక, మానసిక ఆరోగ్యంపై సమగ్ర దృష్టితో అవగాహన, వ్యాయామాలు, మద్దతు కార్యక్రమాలు సమగ్రాభివృద్ధికి మార్గం అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పి గంగమ్మ, అంగన్వాడి కార్యకర్తలు కే జ్యోతి, బి నీలవేణి, ఆర్ స్వాతి కుమారి, జే శైలజ,వి రమ్య, బి శ్రీదేవి, మహాలక్ష్మి, ఎం ఎస్ కె లక్ష్మి ప్రసన్న, ఆర్ దీపిక, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మి, పి పుష్ప, జె శోభవతి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ నిధులతో అంబులెన్స్ కొనుగోలు

**శ్రీకాకుళం, నవంబర్ 22(వార్త):** కొత్తగా కొనుగోలు చేసిన అంబులెన్స్‌ను ప్రజా సేవకు అంకితం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో కొత్త అంబులెన్స్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం రెడ్ క్రాస్ లో ఉన్న అంబులెన్స్ పాడవటాన్ని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు జగన్మోహనరావు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే అంబులెన్స్ తన నిధులతో కొనుగోలు చేసి ఇస్తామని చెప్పి వెంటనే 19.54 లక్షల రూపాయలు నిధులు విడుదల చేసి కొత్త అంబులెన్స్ కొనుగోలు చేసినట్లు వివరించారు. అనంతరం కొబ్బరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో అదనపు డిఎంహెచ్ఓ డాక్టర్ మేరీకేథరీన్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు పి. జగన్మోహన్ రావు, ఎంసి సభ్యులు కనుగుల దుర్గా శ్రీనివాసరావు, వైకుంఠరావు, సత్యనారాయణ, రమణ సతీష్, పి. చైతన్య, తదితరులు పాల్గొన్నారు.




# ఉద్దానాన్ని విధ్వంసం చేస్తే సహించం




**పలాస, నవంబరు 22(వార్త):** కార్గో ఎయిర్పోర్ట్ పేరుతో ఉద్దనాన్ని విధ్వాసం చేస్తే సహించేది లేదని కార్గో ఎయిర్పోర్ట్ ప్రతిపాదన రద్దు చేయాలని కార్గో ఎయిర్పోర్ట్ పోరాట వ్యతిరేక కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కొమర వాసు జోగి అప్పారావు డిమాండ్ చేశారు. వజ్రప కొత్తూరు మండలం ఒంకులూరు గ్రామంలో కార్గో ఎయిర్పోర్ట్ ప్రతిపాదన రద్దు చేయాలని, బలవంతపు భూసేకరణ ఆపాలని, బ్లాక్ బ్యాడ్జిస్ తో గ్రామంలో నిరసన తెలిపారు. కిడ్నీ భూతం కంటే కార్గో భూతం మరింత భయంకరమైనదని వారు అన్నారు. ఉద్దానంలోని భూములను బలవంతంగా తీసుకుని, పంట భూములను ధ్వంసం చేస్తే వారి జీవనాధారం నాశనం అవుతుంది అని ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వారు చెప్పారు. దీంతో ప్రభుత్వం స్థానికుల అభిప్రాయాలను పట్టించుకోకుండా చర్యలు తీసుకుంటే వారు ఆదాయ మునుపటి స్థితికి తిరిగి రాకపోతే తీవ్ర నిరసనలు, ఉద్యమాలు సాధారణమని వారు హెచ్చరించారు. పచ్చని ఉద్దానం చిచ్చు పెట్టేందుకు ప్రభుత్వాలు కుట్ర పడుతున్నాయని మండిపడ్డారు. కార్గో ఎయిర్పోర్ట్ కోసం ఇంచి భూమి కూడా ఇచ్చేది లేదని, ఉద్దానంలో అభివృద్ధి చేయాలంటే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. చాపనైన చస్తాము గానీ భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేకంగా నవంబర్ 21 నుండి 26 వరకు అన్ని గ్రామాల్లో నిరసన సభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామస్వామి, సురేఖ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన మండల స్థాయి విస్తృత సమావేశం



**ఎల్ఎన్ పేట, నవంబరు 22(వార్త):** పాతపట్నం నియోజకవర్గం లో గ్రామ స్థాయి నుండి జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సుడా చైర్మన్ కొరికాన.రవికుమార్, పాతపట్నం నియోజకవర్గ జనసేన నాయకురాలు కొరికాన భవాని కోరారు.శనివారం ఎల్ ఎన్ పేట జంక్షన్ లో ప్రైవేటు కళ్యాణ మండపం నందు జనసేన మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ జనసేన పార్టీ, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వం,సిద్దాంతాలు పట్ల ప్రజలు మంచి అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.వీటికి అనుగుణంగా ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరూ గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేపట్టి ప్రజలకు చేరువకావలని ఆయన తెలిపారు. యువతీ, యువకులు, మహిళలు తోపాటు వివిధ వర్గాల ప్రజలు పార్టీ పట్ల ఆసక్తి చూపుతున్నారని, వారిని పార్టీ లో చేర్పించి బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు.రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామస్థాయి లో పార్టీ పటిష్టంగా చేసి పార్టీ అభ్యర్థులు విజయానికి కృషి చేయాలని కోరారు.ముందు గా సుడా చైర్మన్ రవికుమార్,జనసేన నాయకురాలు భవాని ను జనసేన నాయకులు కార్యకర్తలు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమం లో జనసేన మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.






# పోలీసు అధికారులకు అభినందన

**శ్రీకాకుళం, నవంబర్ 22 (వార్త):** జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో ముఖ్యమైన కేసుల చేదన, గంజాయి పట్టివేత, ప్రాపర్టీ నేరాల చేదన, ముద్దాయిల అరెస్టు, నిందితులకు శిక్షలు పడే విధంగా చేసిన కృషి, ఎన్ఫోర్స్మెంట్ వర్క్స్, గుడ్ వర్క్స్ వంటి అంశాల్లో చాకచక్యంగా వ్యవహరించి ప్రతిభ కనబరిచిన అధికారులను జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా సీఐలు పైడపు నాయుడు (శ్రీకాకుళం రూరల్), చంద్రమౌళి(సీసీఎస్), శ్రీనివాసరావు(నరసన్నపేట), రామారావు, (ట్రాఫిక్, గతంలో పాతపట్నం), భరత్ కుమార్ (ఫింగర్ ప్రింట్, క్లూస్) తోపాటు పలు పోలీసు స్టేషన్లలో సేవలందిస్తున్న ఎస్సైలు, పోలీసు సిబ్బందికి ప్రశంసా పత్రాలను ఎస్పీ అందజేశారు.

# పొగమంచుతో.. ప్రాణాలు హరీ!





## లారీ ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి

మందస, నవంబరు 22(వార్త): విపరీతంగా కురుస్తున్న పొగమంచుతో దారి సక్రమంగా కనిపించకపోవడంతో లారీ ఢీకొని ఓ వ్యక్తి మరణించాడు. మందస మండలంలోని బాలిగాం సమీపంలో గల జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఇచ్ఛాపురం మండలంలోని లొద్దపుట్టి పంచాయతీ శాసనాం గ్రామానికి చెందిన గుజ్జు ధర్మారావు (45) ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ధర్మారావును హరిపురంలో గల సామాజిక ఆరోగ్య కేంద్రానికి మందస 108 వాహనంలో తరలించారు. చికిత్స పొందుతూ ధర్మారావు ఆసుపత్రిలో మరణించాడు. ఈ మేరకు మృతునికి కుటుంబానికి సమాచారం అందించారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



- ఇటీవల దట్టంగా కురుస్తున్న పొగమంచు
- రహదారులపై వాహనాలు కనిపించక ప్రమాదాలు
- పొగమంచుతో దారి కనిపించక వాహనచోదకుడిని ఢీకొట్టిన లారీ
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి
- టోల్‌గేట్ల వద్ద ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 22 (వార్త):** పొగమంచు ప్రాణాలను హరిస్తోంది. దట్టంగా పొగమంచు కురియడంతో ఎదురుగా వెళుతున్న వాహనాలు కనబడక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జాతీయ రహదారి కావడంతో వాహనాలు వేగంగా వెళుతుంటాయి. డ్రైవర్లు అన్ని జాగ్రత్తలు తీసుకుని వాహనాలు నడుపుతున్నా పొగమంచు వల్ల ప్రమాదాలు సంభవిస్తునే ఉన్నాయి. దీనికితోడు కొందరు వాహనాలను రోడ్డుకు పక్కనే పెట్టడం, నిబంధనలు పాటించకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. టోల్‌ప్లాజాల వద్ద ఇష్టారాజ్యంగా వాహనాలను నిలుపుతుంటారు. బ్లింకర్లు కూడా వేయకపోవడంతో వెనుకనుంచి వచ్చే వాహనాలకు దగ్గరకు వచ్చే వరకూ కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. నరసన్నపేట మండలం మడపాం జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజా సమీపాన రోడ్డుకు ఆనుకుని పెద్ద ఎత్తున హొటళ్లు, ఇతర షాపులు ఉన్నాయి. దీంతో పెద్ద ఎత్తున వాహనాలు అడ్డదిడ్డంగా ఆ ప్రాంతంలో నిలుపుతుంటారు. రాత్రివేళ వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. అక్కడే పోలీసులు ఉంటున్నప్పటికీ సరైన చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి.



# పెండింగ్ కేసుల దర్యాప్తులో పురోగతి సాధించాలి

- నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలుపై జాప్యం ఉండరాదు
- లోక్ అదాలత్ కేసులు పరిష్కారానికి చర్యలు చేపట్టాలి
- జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి
- నేర సమీక్ష సమావేశంలో పోలీసు అధికారులకు దిశానిర్దేశం



**శ్రీకాకుళం, నవంబరు 22(వార్త):** అపరిష్కృతంగా ఉన్న కేసులపై దృష్టి కేంద్రీకరించి, వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేసి అరెస్టు కానీ ముద్దాయిలను అరెస్టు చేయాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో జిల్లా ఎస్పీ నెల వారి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో పెండింగ్లో ఉన్న కేసులు దర్యాప్తు, ముద్దాయిలు అరెస్ట్, ఛార్జ్ షీట్ దాఖలు, కొత్త చట్టాలు అమలు, నాన్ బెయిల్బుల్ వారెంట్లు , బెయిల్ కౌంటర్ దాఖలు, ప్రాపర్టీ నేరాలు, లోక్ అదాలత్ కేసులు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... అపరిష్కృతంగా ఉన్న తీవ్రమైన(గ్రేవ్) కేసులలో నిశితమైన సాక్షి ఆధారాలతో సమగ్రమైన దర్యాప్తుతో పురోగతి సాదించాలని, పెండింగ్ నాన్ బెయిల్ బుల్ వారెంట్లు అమలు, గ్రేవ్ కేసులు దర్యాప్తు వేగవంతం చేసి ఛార్జ్ షీట్ కోర్టులో దాఖలు చేయాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 13న జరగబోయే లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఫోక్సో కేసులలో దర్యాప్తు నిర్ణీత 60 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కేసులు దర్యాప్తులో వైద్యులు, ఫోరెన్సిక్ నిపుణులు నివేదికలు తెప్పించికోవాలన్నారు.జిల్లాలో ప్రాపర్టీ నేరాలకు పాల్పడుతున్న పాత నేరస్థులు, జైలు నుండి విడుదలైన నేరస్థులు,ఇతర రాష్ట్రాలనుండి వచ్చే అంతర్ రాష్ట్ర గ్యాంగులు, వ్యక్తులపై పర్యవేక్షణ, నిఘా పెంచాలన్నారు. నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక గస్తీ, పెట్రోలింగ్ పెంచాలని సూచించారు. రానున్న స్థానిక ఎన్నికలు నేపథ్యంలో ప్రతి రోజు విలేజ్ విజిట్ చేసి గ్రామస్తులతో సమీక్షించి సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఓపెన్ డ్రింకింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, పబ్లిక్ న్యూసెన్స్ చేసే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. సైబర్ కేసులలో బాధితులు పోగొట్టుకున్న నగదును చట్ట ప్రకారం చర్యలు చేపట్టి సదురు నగదును బాధితులకు అందేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.సరిహద్దు చెక్ పోస్టుల వద్ద ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు.అక్రమ మద్యం, నాటు సారా, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి శ్రీనివాసరావు, డిఎస్పీలు సి.హెచ్ వివేకానంద, డి. లక్ష్మణరావు, ఏఓ సీహెచ్ గోపినాథ్ , ఎస్బి సీఐ ఇమ్మన్యుయల్ రాజు, సీఐలు, ఎస్ఐ పాల్గొన్నారు.



# నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణలు

## జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్

**శ్రీకాకుళం, నవంబరు 22(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏ.పి.ఎస్.ఎస్. డి.సి.) ఆధ్వర్యంలో, పి.ఎం.కె.వి.వై. 4.0 పథకం ద్వారా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఒక బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తద్వారా వారికి ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా, జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ లలో శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. నవంబర్ చివరి వారం నుంచి వివిధ నైపుణ్య శిక్షణలను అందించడం జరుగుతుందని, ఈ శిక్షణల కాలవ్యవధి 3 నుంచి 4 నెలలు ఉంటుందని తెలియజేశారు. నియోజకవర్గాల పరిధిలోని స్కిల్ హబ్‌ల వివరాల విషయానికి వస్తే, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు (బారువ, నరసన్నపేట, టెక్కలి)లలో సి.సి.టి.వి. సూపర్‌వైజర్, కస్టమర్ కేర్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ (వాయిస్ నాన్ వాయిస్) వంటి శిక్షణలు అందిస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాతపట్నం, ప్రభుత్వ ఐ.టి.ఐ.లు (శ్రీకాకుళం, ఎచ్చెర్ల), మరియు ప్రభుత్వ పాలిటెక్నిక్, ఆమదాలవలస లలో సైబర్ సెక్యూరిటీ సోషల్ మీడియా అనలిస్ట్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, జూనియర్ సూపర్‌వైజర్ (సేల్స్) వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా, డాక్టర్.వి. కణితీస్ ప్రభుత్వ ఐ.టి.ఐ., పలాసలో అసిస్టెంట్ కన్స్ట్రక్షన్ ఫిట్టర్, ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్ అండ్ పెరిపెరల్స్, ఎలక్ట్రిక్ వెహికల్ సర్వీస్ లీడ్ టెక్నీషియన్ వంటి పలు విభిన్న శిక్షణలు ఉన్నాయి. మరింత సమాచారం కోసం తేజ (స్కిల్ హబ్ సమన్వయ కర్త, 99895 12143) ను సంప్రదించవచ్చు. అలాగే, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నరసన్నపేట స్కిల్ హబ్ వివరాల కొరకు గోవర్ధన్ (99499 00672), ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి వివరాల కొరకు రమేష్ (94932 90012) లను సంప్రదించవచ్చు. ఇతర ముఖ్య కేంద్రాలైన పాతపట్నం, శ్రీకాకుళం, ఎచ్చెర్ల మరియు ఆమదాలవలస లలో 'సైబర్ సెక్యూరిటీ సోషల్ మీడియా అనలిస్ట్' వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాతపట్నం వివరాల కొరకు అనూష (95532 92734), ప్రభుత్వ ఐ.టి.ఐ., శ్రీకాకుళం వివరాల కొరకు శేషగిరి (78934 54256), ప్రభుత్వ ఐ.టి.ఐ., ఎచ్చెర్ల వివరాల కొరకు స్వప్న (79891 77887), ప్రభుత్వ పాలిటెక్నిక్, ఆమదాలవలస వివరాల కొరకు వెంకటేష్ (75690 77449) లను సంప్రదించవచ్చు. డాక్టర్.వి. కణితీస్ ప్రభుత్వ ఐ.టి.ఐ., పలాస (సోమేష్, 99085 90730) లో ప్రత్యేకించి 'ఎలక్ట్రిక్ వెహికల్ సర్వీస్ లీడ్ టెక్నీషియన్' వంటి కోర్సులు అందిస్తున్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఉరిటి సాయికుమార్ కోరారు.

## యు.పి.ఎస్.సి.సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

యు.పి.ఎస్.సి. నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమి నరీ, మెయిన్స్ పరీక్షలకు అర్హత గల అభ్యర్థులు నుండి ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరించబడునని జిల్లా బిసి సంక్షేమ అధికారి ఇ. అనూరాధ ఒక ప్రక టనలో పేర్కొన్నారు. జిల్లాకు చెందిన బిసి, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీక రించుటకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మరియు సాధికారత అధికారి/ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్ ఫర్ బ్యాక్ వార్డ్ క్లాసెస్ లో అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 25వ తేదీ లోగా బిసి స్టడీ సర్కిల్ వాంటి కాలనీ, శ్రీకాకుళం కార్యాలయము నందు దరఖాస్తు చేసికోనవలసి ఉంటుందని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు డిసెంబర్ 5వ తేదీన విశాఖపట్నంలో సివిల్ సర్వీసెస్ సిలబస్ ఆధారంగా ఆబ్జెక్టివ్ బిట్ టైపులో స్క్రీనింగ్ పరీక్ష ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ స్క్రీనింగ్ పరీక్ష లో మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికపై అభ్యర్థులను ఎంపిక చేసి, వారికి బిసి. భవన్, గొల్లపూడి, విజయ వాడ శిక్షణా కేంద్రం ద్వారా ఉచిత శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్, భోజన, వసతి సౌకర్యాలను కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు టెన్త్, డిగ్రీ మార్క్ లిస్టులు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం (తల్లి దండ్రుల వార్షిక ఆదాయం రూ.1,00,000/- లోపు మాత్రమే) ఆధార్ మరియు బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్, రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు జత పరచి అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ లోగా వాంబే కాలనీ, శ్రీకాకుళం కార్యాలయంలో దరఖాస్తు చేసికోనవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరములకు ఈ క్రింది ఫోన్ 8332852106, 7382975679 నంబర్ లను సంప్రదించాలన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546